క్లుప్తంగా

స్పాట్ బిల్లింగ్‌పై దృష్టి పెట్టండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ నెలవారీ బిల్లులు తీసే స్పాట్ బిల్లింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి సూచించారు. శనివారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులు జారీ చేయడంలో ఎలాంటి సమస్య తలెత్తరాదని సూచించారు. నిర్ణీత గడువు లోపు ప్రక్రియ పూర్తి చేసి 100 శాతం బిల్లులు రాబట్టాలన్నారు. పాత బిల్లులు, మొండి బకాయిలను ఎలాగైనా రాబట్టాలని, ప్రభుత్వ శాఖలకు ఎప్పటికప్పుడు ఆయా అధికారులతో మాట్లాడి వసూలు అయ్యేలా చూడాలన్నారు. అంతరాయం, ఇతర సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించి పునరుద్ధరించాలని చెప్పారు.

4 నుంచి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌కు ముందస్తుగా రైతులకు వివిధ అంశాలపై సబ్ డివిజన్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు జిల్లా వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందు కోసం ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకు వ్యవసాయ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 4న ఉదయం ఎమ్మిగనూరు, నందవరం, సాయంత్రం గోనెగండ్ల, మంత్రాలయం, 6న ఉదయం ఆదోని, కోసిగి, సాయంత్రం కౌతాళం, పెద్దకడుబూరు, 10న ఉదయం ఆలూరు, చిప్పగిరి, హాలహర్వి, సాయంత్రం ఆస్పరి, హొళగొంద, 12న ఉదయం పత్తికొండ, కృష్ణగిరి, తుగ్గలి, సాయంత్రం దేవనకొండ, మద్దికెర, వెల్దుర్తి, 13న ఉదయం కర్నూలు, కోడుమూరు, గూడూరు, సాయంత్రం కల్లూరు, సీ.బెళగల్, ఓర్వకల్ మండలాలకు చెందిన ఆర్‌బీకే ఇన్‌చార్జులు, ఏఈవోలు, మండల వ్యవసాయాధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

'మోదీ పాలనకు చరమగీతం పాడాలి'

కర్నూలు(సెంట్రల్): 2024లో జరిగే ఎన్నికల్లో మోదీ పాలనకు చరమగీతం పాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నగర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, కె.జగన్నాథం, ఎస్‌ఎన్ రసూల్, సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. సీపీఐ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14 నుంచి 30వ తేదీ వరకు మోదీ పాలనకు చమరగీతం పాడేందుకు ప్రజా చైతన్య యాత్రలు చేపట్టనున్నట్లు తెలిపారు.

నేడు సాహితీ సదస్సు

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వంద సంవత్సరాల 'మాలపల్లి ' ఉన్నవ లక్ష్మీనారాయణ నవలపై సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర తెలిపారు. ఎస్.వి. కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఈ సదస్సును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సాహితీ ప్రియులు అందరూ పాల్గొనాలని సూచించారు.

సత్యకుమార్‌పై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సత్యకుమార్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాలంకి రామస్వామి డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించి తమ పార్టీ నాయకుడు సత్యకుమార్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌ను కలసి వినతిపత్రం ఇచ్చారు. ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో బలో పేతం చేసేందుకు కృషి చేస్తానని ఆ పార్టీ కర్నూలు అసెంబ్లీ కన్వీనర్ సారాయి రంగస్వామి అన్నారు. నూతనంగా అసెంబ్లీ కన్వీనర్‌గా నియమితులైన ఆయనను శనివారం వీఆర్ కాలనీలోని ఆ పార్టీ కార్యాలయంలో నాయకు లు సన్మానించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సాయి ప్రదీప్, కిసాన్ మోర్చా నాయకులు సన్మానం చేసిన వారిలో ఉన్నారు.

యువజన సమ్మేళనాలను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): మే 20 నుంచి 24వ తేదీ వరకు గుంటూరులో అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న విద్యా, వైజ్ఞానిక, రాజకీయ సాంస్కృతిక యువజన సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఈ సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం సీఆర్ భవన్‌లో జరిగిన రాయలసీమ జిల్లాల వర్కుషాపులో వారు మాట్లాడుతూ... యువజన సమ్మేళనాలకు ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి, పార్లమెంట్ సభ్యులు సంతోష్‌కుమార్, కేరళ మాజీ మంత్రి వినయ్‌విశ్వం తదితర ప్రముఖులు హాజరు కానున్నట్లు చెప్పారు. కాగా, అంతకముందు రాయలసీమ జిల్లాల వర్కుషాపులో ఉద్యోగాల కోసం యువత గళమెత్తాలని ఆ సంఘంజాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్, మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు.

అరచేతిలో రంగవల్లి!

- కొత్త పుంతలు తొక్కుతున్న మెహిందీ
- మోచేతుల వరకు గోరింటాకు అలంకరణ
- ఉపాధి పొందుతున్న మహిళలు



చేతులకు మెహింది పెడుతున్న యువతి



కర్నూలు(హాస్పిటల్): చేతిలో గోరింటాకు ఎర్రగా పండితే ఎర్రటి మొగుడొస్తాడని ఆడపిల్లలను ఆటపట్టిస్తారు. చేతికి గోరింటాకు పెట్టుకుంటే శరీరానికి చలువ చేస్తుందని నమ్ముతారు. నమ్మకం ఏదైనా కానీ గోరింటాకు ఒక సంస్కృతి, సాంప్రదాయం. పండుగలు, పర్వదినాలు, వివాహాది శుభకార్యాలయాల్లో ఆడపడుచుల చేతికి గోరింటాకు తప్పనిసరిగా మారింది. కొన్ని కుటుంబాల్లో మెహింది(గోరింటాకు) పెట్టుకోవడానికి కూడా ఓ వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇలాంటి మెహిందికి ఇటీవల కాలంలో మరింత బాగా ఆదరణ పెరిగింది. దీంతో వందలాది మంది దీనిద్వారా ఉపాధి పొందుతున్నారు.

కర్నూలు నగరంలో బ్యూటీషియన్ కోర్సు అభ్యసించిన వారు 12వేల మంది దాకా ఉంటారు. అందులో ప్రత్యేకంగా మెహింది పెట్టడం నేర్చుకున్న వారి సంఖ్య రెట్టింపులో ఉంటుంది. దీనిని ఉపాధిగా మలుచుకున్న వారు 6వేల మంది దాకా ఉంటారు. ఒకప్పుడు పండుగలు, పర్వదినాలు, వివాహాది శుభకార్యాల్లో కేవలం ఇంట్లో వారే ఒకరికొకరు గోరింటాకును అరచేతుల్లో పెట్టుకునే వారు. ఎవరికి వారు వారికి వచ్చిన డిజైన్లతో అరచేతిలో రంగవల్లులు అద్దేవారు. ఇందులో అధికంగా చందమామ ఎక్కువగా వేసుకోవడం మనం చూసే ఉంటాము. అయితే గోరింటాకు పెట్టుకోవడం కూడా ఫ్యాషన్‌గా రూపుదిద్దుకుంది. దీనిని ఓ అందమైన కళగా తీర్చిదిద్దారు. ఈ మేరకు ప్రత్యేకంగా కోర్సులు కూడా ఏర్పాటయ్యాయి. బ్యూటిషయన్ కోర్సుల్లో భాగంగా ఆరు నెలల్లో శిక్షణ తీసుకుంటుండగా కేవలం మెహింది కోర్సు మాత్రమే రెండు నెలల పాటు శిక్షణ పొందుతున్న వారున్నారు.

మెహింది పెట్టడం అందమైన ఉపాధి : వివాహాది శుభకార్యాలయాలకు మెహింది(గోరింటాకు)ని ఆడపడుచులకు పెట్టడం ఇప్పుడు ఓ ఉపాధిగా మారింది. కేవలం పెళ్లి కూతురుకు మెహింది పెట్టడానికే డిజైన్‌ను బట్టి రూ.3వేల నుంచి రూ.5వేల దాకా ఫీజు తీసుకునేవారున్నారు. పెళ్లికి వచ్చిన వారికి మెహింది పెట్టడం కోసం రూ.40వేల నుంచి రూ.1లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వేడుకను కూడా నిర్వహిస్తున్నారు. ఒక్కొక్కరికి మెహింది పెట్టాలంటే డిజైన్‌ను బట్టి అరగంట నుంచి మూడుగంటల వరకు సమయం పడుతోంది. మెహిందిని ఉపాధిగా ఎంచుకున్న వారు వారితో పాటు మరో ముగ్గురు, నలుగురికి అసిస్టెంట్స్‌గా ఉంచుకుని వారికి ఉపాధి కల్పిస్తున్నారు.

గోరింటాకుతో ఆరోగ్యప్రయోజనాలు

గోరింటాకును ఒకప్పుడు కేవలం అరచేతికి మాత్రమే పెట్టుకునేవారు. ఇప్పుడు మోచేతి వరకు, మళ్లీ కాళ్లకు కూడా డిజైన్లుగా పెట్టుకుంటున్నారు. ఉద్దేశం ఎలాంటిదైనా గోరింటాకు పెట్టుకోవడం వల్ల వ్యక్తుల అందం ద్విగుణీకృతం కావడంతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయని ప్రజలు నమ్ముతున్నారు. ముఖ్యంగా ఆషాఢ, బాద్రపద, ఆశ్వీయుజ మాసాల్లో గోరింటాకు పెట్టుకోవడం తెలుగిళ్లలో ఆనవాయితీ. వాతావరణ మార్పుల ప్రభావం శరీరంపై పడకుండా ఉండి, ఎలాంటి చర్మవ్యాధులు రాకుండా ఉండేందుకు గాను గోరింటాకు పెట్టుకుంటారు. దీంతో పాటు గోరింటాకు శరీరంలో అధిక ఉష్ణోగ్రతను గ్రహిస్తుంది. చేతులు, పాదాల ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది.



వివిధ ఆకృతులలో అరచేతిలో మెహింది

రెండు నెలల పాటు శిక్షణ



మా వద్ద గత పదిహేనేళ్లుగా కొన్ని వేల మందికి బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇచ్చాము. ఈ కోర్సులో భాగంగా మెహింది కూడా ఉంటుంది. బ్యూటీషియన్ కోర్సు గాకుండా కేవలం మెహింది మాత్రమే నేర్చుకోవాలని వచ్చేవారూ ఉన్నారు. ఇటీవల ఇలాంటి వారు అధికమయ్యారు. వారికి రెండు నెలల పాటు శిక్షణ ఇస్తున్నాము. మెహిందిలో ఇండియన్, అరబిక్, ఇండో–అరబిక్, బ్రైడల్ మెహంది, ఫ్యాన్సీ డిజైన్స్, నార్మల్ రకాలు ఉన్నాయి.

–ఎ.పద్మజ, కేఎఫ్‌టీ ఇన్స్టిట్యూట్ యజమాని, కర్నూలు

ఎక్కువగా వివాహాల్లో డిమాండ్



నేను మూడేళ్ల క్రితం బ్యూటీషియన్ కోర్సును నేర్చుకున్నాను. అందులో భాగంగా మెహింది కూడా అభ్యసించాను. ప్రస్తుతం ఇంట్లోనే నేను బ్యూటీషియన్ పార్లర్‌ను కొనసాగిస్తున్నాను.వివాహాది శుభకార్యాలకు వెళ్లి మెహింది పెట్టి వస్తుంటాను. నా కింద మరో ముగ్గురు అసిస్టెంట్స్ ఉన్నారు. వారికి ఉపాధి లభిస్తుంది. పెళ్లికూతురు మెహిందికి రూ.2,500ల నుంచి రూ.5వేలు, ఇతరులకు డిజైన్‌ను బట్టి రూ.500ల నుంచి రూ.5వేల వరకు ఫీజు తీసుకుంటాము.

–దమయంతి, బుధవారపేట, కర్నూలు

అందంతో పాటు ఆనందం



నేను ప్రతి పండుగకు గోరింటాకు చేతులకు పెట్టుకుంటాను. వివాహాది శుభకార్యాలకు గాను ప్రత్యేకంగా శిక్షణ పొందిన వారితో మెహింది పెట్టించుకుంటాను. ఈ మేరకు చేతికి ఎంతో అందంగా ఉండటంతో పాటు ఆనందంగా కూడా ఉంటుంది. ఒక విధంగా గోరింటాకు పెట్టుకోవడం మన సంస్కృతి, సాంప్రదాయంలో భాగం. మన ఆరోగ్యం కోసం పూర్వీకులు ఈ సంప్రదాయాన్ని కొనసాగించారు. దీనివల్ల చర్మ సమస్యలతో పాటు శరీరంలో ఉండే అధిక ఉష్ణోగ్రత తగ్గుతుంది.

–బి. సుజాత, భాగ్యనగర్, కర్నూలు

జర్నలిస్టుల స్థలాల్లో మట్టి తవ్వకాలు అడ్డుకోవాలి

కర్నూలు(సెంట్రల్): జగన్నాథగట్టులో జర్నలిస్టులకు ఇచ్చిన ఇండ్ల స్థలాల్లో కొందరు అక్రమంగా మట్టిని తరలించి అమ్ముకోవడం అన్యాయమని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు శనివారం ఓ ప్రకటనలో ఖండించారు. వెంటనే అక్రమ మట్టి తవ్వకాలను పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ శాఖలు అడ్డుకోవాలని, తరలించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆయన కోరారు.

'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణ అడ్డుకుంటాం

కర్నూలు(సెంట్రల్): విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ పరం కాకుండా అడ్డుకుంటామని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్.రాధాకృష్ణ, ఎస్.మునెప్ప పేర్కొన్నారు. శనివారం ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖపట్నంలో ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఉక్కు దీక్షకు 700 రోజులు కావడంతో వారికి మద్దతుగా కలెక్టరేట్ ఎదుట ఆయా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేంద్రంలోని బీజేపీ సర్కార్ విశాఖ ఉక్కును ఆదానికి అప్పగించేందుకు చూస్తోందన్నారు.అందుకోసమే లాభాల బాటలో ఉన్న కంపెనీని నష్టాల్లోకి కావాలనే నెట్టారన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాలు, సాయిబాబా, అబ్దుల్లా, రాజగోపాల్, రామాంజనేయులు, ఈశ్వర్, కిట్టు, రాజు, రేణుక, సి.గురుశేఖర్ పాల్గొన్నారు.

నేడు 'కథా స్రవంతి' ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ రచించిన 'కథా స్రవంతి' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పాలగిరి విశ్వప్రసాద్, తవ్వా ఓబుల్‌రెడ్డి, ఉమామహేశ్వర్, జంధ్యాల రఘుబాబు, డాక్టర్ చంద్రమౌళిని ముఖ్య వక్తలుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సాహితీ అభిమానులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

త్వరలోనే అందుబాటులోకి ఈట్ స్ట్రీట్

- అత్యుత్తమ నగరాల్లో కర్నూలును ప్రథమ స్థానంలో నిలుపుదాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలోనే అన్ని మౌలిక సదుపాయాలు కలిగిన అత్యుత్తమ నగరాల్లో కర్నూలును ప్రథమ స్థానంలో నిలిపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. త్వరలోనే నగర ప్రజలకు ఈట్ స్ట్రీట్‌ను అందుబాటులోకి తేస్తామని వివరించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కర్నూలు స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ మిషన్ కమిటీ సభ్యుల సమావేశం కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిర్లా గేట్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రూ.1.83 కోట్లతో చేపట్టే ఈట్ స్ట్రీట్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే రూ.1.50 కోట్లను ఖర్చు చేశామని కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ వివరించగా మిగిలిన నిధుల వినియోగానికి కర్నూలు స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ అనుమతులు ఇవ్వాల్సి ఉందన్నారు. దీంతో అనుమతులు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఒకే చెప్పింది. ఎస్పీ డాక్టర్ సిద్ధార్థ కౌశల్ మాట్లాడుతూ..కర్నూలు నగరం సేఫ్ సిటీ అన్నారు. రాష్ట్రంలోనే నాలుగో అతిపెద్ద జనాభా కలిగిన నగరమని, ఇక్కడ ప్రజలు ఎంతో ప్రశాంతంగా ఉండి శాంతిభద్రతలకు పూర్తి సహకారం అందిస్తున్నారన్నారు. ప్రజల రక్షణకోసం పోలీసు శాఖ తరపున అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఆసుపత్రి ముందు దుకాణాల తొలగింపు

కర్నూలు(హాస్పిటల్)/కర్నూలు (టౌన్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ముందు ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసుకున్న దుకాణాలను శనివారం ఉదయం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఆసుపత్రి ప్రధాన గేటు నుంచి రెండో గేటు వరకు ఇటీవల కాలంలో పలువురు వ్యక్తులు బంకులు, తోపుడు బండ్లు, షెడ్లు వేసుకుని నిర్మాణాలు చేశారు. ఈ మేరకు మొత్తం 20కి పైగా దుకాణాలు వేసుకుని చిరువ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇందులో కొందరు దుకాణాలు వేసి ఇతరులకు అద్దెకు ఇచ్చారు. ఈ దుకాణాల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని భావించిన అధికారులు శనివారం వాటిని తొలగించారు. కాగా బంకులను తొలగించడంతో వ్యాపారులు స్థానిక నగరపాలక సంస్థ వద్ద ఆందోళన చేశారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. నగరపాలక మేనేజర్ చిన్నరాముడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో షాపులకు సంబంధించి వెంకటరాముడు, మద్దయ్య, నిశ్చిత, లక్ష్మీదేవి తదితరులు ఉన్నారు.

పది విద్యార్థులకు వీడ్కోలు

కర్నూలు సిటీ: ఏపీఎస్‌పీ క్యాంపులోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగర పాలక ఉన్నత పాఠశాలలో శనివారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో హాజరుకావాలని, ఎలాంటి ఒత్తిడికి గురికాకూడదన్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. అనంతరం ఎన్‌ఎంఎంఎస్–2022 విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం వెంకటరెడ్డి, టీచర్లు సుగుణమ్మ, శివన్నారాయణ, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు బాసటగా నిలవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా నాల్గవ అదనపు జడ్జి జి.ప్రతిభాదేవి



పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు

కర్నూలు(లీగల్):పోక్సో కేసుల్లో బాధితులకు ప్రభుత్వం పరంగా అందాల్సిన నష్టపరిహారం కాని ఇతరత్రా వాటిని అందించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు అండగా నిలవాల్సిన అవసరం ఉందని జిల్లా నాల్గవ అదనపు జడ్జి జి.ప్రతిభాదేవి పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో పోలీసు అధికారులకు, ప్యానల్ న్యాయవాదులకు పోక్సో చట్టం, రోడ్డు ప్రమాద కేసుల్లో బాధితులకు అందాల్సిన నష్టపరిహారం అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకట నాగ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. పోక్సో చట్టం బాధితుల పరిహార పథకం 2015 ప్రకారం లైంగిక వేధింపులు, ఇతర నేరాల బాధితులకు ఎన్‌ఏఎల్‌ఎస్‌ఏ పరిహార పథకం, 2018 సంవత్సరం న్యాయాధికారులు, పోలీసు అధికారులు, రెవెన్యూ, న్యాయవాదులతో బాధితుల పరిహార పథకాల గురించి అవగాహన కల్పించారు. మహిళా కోర్టు న్యాయమూర్తి జి.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాద కేసుల్లో చట్టాల్లో నిబంధనలపై సవరణ చట్టం, కాల పరిమితి, పోలీసు, బాధితులు, డ్రైవర్లు, యాజమాన్యం, ఇన్సూరెన్స్ కంపెనీలు, న్యాయస్థానాలు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి పాండురంగారెడ్డి, సబ్ జడ్జి దివాకర్, జూనియర్ సివిల్ జడ్జిలు షర్మిల, జ్యోత్స్న దేవి, వందన కల్యాణి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధుల నుంచి టీకా రక్షణ

కర్నూలు(హాస్పిటల్): పలు ప్రాణాంతక వ్యాధుల నుంచి టీకా రక్షణ కల్పిస్తుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం ఆయన స్థానిక బండిమెట్ట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని 10వ సచివాలయాన్ని సందర్శించారు.అక్కడ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. గర్భవతికి, శిశువులకు, పిల్లలకు ప్రాణాంతక వ్యాధులు రాకుండా వ్యాధినిరోధక టీకాలు వేయాలని ఆదేశించారు. వ్యాధినిరోధక టీకాల ఆవశ్యకత గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అపర్ణ, ప్రాజెక్టనిస్టు ఖలీల్, హెల్త్ సెక్రటరీలు, ఆశాలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు



ఆసరా సంబరాలకు హాజరైన మహిళలు



లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

- ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్
- మహిళలకు రూ.2.83 కోట్లు చెక్ అందజేత
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. వలంటీర్ల ద్వారా సంక్షేమ ఫలాలు ఇంటి వద్దకే అందుతున్నాయని, ప్రతిపక్ష పార్టీలు చేసే బోగస్ ప్రచారం నమ్మవద్దని కోరారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ పరిధిలోని బి.క్యాంపు ఆరోరానగర్ జమ్మిచెట్టు వద్ద వైఎస్‌ఆర్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ఆసరా మూడవ విడత కింద 439 పొదుపు గ్రూపుల్లోని 4,390 మంది మహిళలకు మంజూరైన రూ. 2.83 కోట్ల చెక్కును ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. మహిళలు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తూచ తప్పకుండా అమలు చేస్తున్నారని, మూడున్నరేళ్లలో 93.5 శాతం హామీలను నెరవేర్చారన్నారు. 2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఓట్ల కోసం పొదుపు మహిళలకు రుణాలు చెల్లిస్తామని చెప్పి వారిని నిలువునా మోసం చేశారని ఆరోపించారు. దీంతో అక్కచెల్లెమ్మలు బ్యాంకుల్లో రుణాలు చెల్లించలేకపోవడంతో ఏ– గ్రేడ్‌లో ఉన్న సంఘాలన్ని డీ– గ్రేడ్‌లోకి పడిపోయాయన్నారు. అయితే తమ ప్రభుత్వం పొదుపు మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి సంవత్సరం ఆసరా పథకం అమలు చేస్తూ వారికి అండగా నిలుస్తోందన్నారు. ఎన్నికలు వస్తుండటంతో మరోసారి తెలుగుదేశం నాయకులు తప్పుడు హామీలు, మాయ మాటలు చెప్పేందుకు వస్తున్నారని, వారిని నమ్మవద్దని సూచించారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ నాయకులకు లంచాలు ఇచ్చుకుంటే తప్ప అర్హులైన పేదలకు పథకాలు మంజూరు కానీ పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు ఎవరి సిఫారసు లేకుండా పథకాలు అందుతున్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, కార్పొరేటర్లు షేక్ ఆలియా, మెప్మా పీడీ నాగశివలీల, టీఎంసీలు సుధాకర్, పార్టీ నాయకులు గడ్డం రామకృష్ణ, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని నందనవనం చేస్తాం

- మేయర్ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని
- 1.87 కోట్లతో నిర్మించిన సైన్స్ థీమ్ పార్కు ప్రారంభం



సైన్స్ పార్కును ప్రారంభిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య తదితరులు

కల్లూరు: కర్నూలు నగరాన్ని నందనవనం చేస్తామని మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం కల్లూరు అర్బన్ 20వ వార్డు అమ్మహాస్పిటల్ సమీపంలో రూ.1.87 కోట్లతో నిర్మించిన సైన్స్ థీమ్ పార్కు ప్రారంభోత్స కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్, ఎమ్మెల్యే, కమిషనర్ భార్గవ్ తేజ ముఖ్య అతిథులుగా హాజరై పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ సైన్స్ థీమ్ పార్కులో వివిధ శాస్త్రవేత్తల చిత్రాలు, పారాబొలిక్ డిష్/యాంటినా వంటి ఆకర్షినీయమైన వాటిని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు సృజనాత్మకతను పెంపొందించడంతోపాటు ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండేలా పార్కును తీర్చిదిద్దామన్నారు. నగరంలోని అన్ని పార్కులను అభివృద్ధిలోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. సుందరీకరణలో భాగంగా ప్రతి పార్కును ఆధునికంగా అభివృద్ధి చేస్తామన్నారు. కర్నూలు నగరపాలక సంస్థలో పాలకవర్గం ఏర్పడాక ఈ రెండు సంవత్సరాల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కర్నూలు నగర వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, పలువురు కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రాణాలు నిలిపే బీఎల్‌ఎస్‌పై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వై.అశోక్

కర్నూలు(హాస్పిటల్): బేసిక్ లైఫ్ సపోర్ట్(బీఎల్‌ఎస్) శిక్షణ తీసుకుంటే ప్రాణాపాయస్థితిలో ఉన్న చాలా మంది ప్రాణాలు కాపాడవచ్చని బీఎల్‌ఎస్ ఇన్‌స్ట్రక్టర్, అనెస్తెటిస్ట్ లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ వై.అశోక్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజి టెక్నీషియన్లు, బీఎస్సీ, జనరల్ నర్సింగ్ సిబ్బందికి బీఎల్‌ఎస్‌పై రెండురోజుల పాటు నిర్వహించే వర్క్‌షాప్ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ వై.అశోక్ మాట్లాడుతూ సమాజంలో బాధ్యత గల ప్రతి పౌరుడూ బీఎల్‌ఎస్ శిక్షణ తీసుకోవాలని, తద్వారా ఎవ్వరికైనా ప్రాణాపాయ పరిస్థితి వచ్చినప్పుడు అత్యవసరంగా ఛాతిపై ఒత్తిడి తెచ్చి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. బీఎల్‌ఎస్ ప్రక్రియలో ప్రతి నిమిషానికి వందసార్లు ఛాతిపై ఒత్తిడి తేవాలని, అందులో ప్రతి 30సార్లకు ఒకసారి నోటిలో గాలిని ఊదాలని చెప్పారు. ఈ క్రమంలో రోగి స్పృహలోకి వచ్చే వరకు ఒత్తిడి చేస్తూ ఉండాలని సూచించారు. హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ గన్నవరంకు చెందిన డాక్టర్ వై.అశోక్ యుపీ, పీజీ, బిఎస్సీ నర్సులకు బీఎల్‌ఎస్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారని, ఇప్పటి వరకు ఆయన 93వేల మందికి ఈ శిక్షణ అందించారని తెలిపారు. భారత సైన్యంలోనూ ఆయన 22 ఏళ్ల పాటు వివిధ దశలో దేశసేవ చేశారని తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.